TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :13 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.07.08.2025 పేజీలు : 4, వెల:రూ.1.00

## చేనేత రంగానికి సర్కార్ పెద్దపీట



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. వారికి ఆర్థికంగా చేయూతనందించేందుకు అన్ని శాఖలు, కార్పొరేషన్లు, సంస్థల ద్వారా వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2025-26లో ఇప్పటివరకు రూ.587.26 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చింది. ఇందిరా మహిళ శక్తి స్వయం సహాయక బృందాలకు చెందిన 65 లక్షల మంది మహిళలకు ఏడాదికి రెండు సార్లు ఉచితంగా చీరలు పంపిణీ చేసేందుకు 131 మ్యాక్స్, 56 చిన్నతరహా పరిశ్రమల్లో చీరలు తయారు చేయిస్తున్నారు. రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో గతేడాది తెలంగాణ చేనేత కార్మిక సహకార సంఘం (టీజీఎస్‌సీవో) నోడల్ ఏజెన్సీగా వేములవాడలో యార్న్ డిపోను ఏర్పాటు చేసింది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని హైదరాబాద్‌లో నెలకొల్పింది. రూ.33 కోట్లతో ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు రుణమాఫీ పథకాన్ని అమలు చేసింది. తెలంగాణ చేనేత అభయహస్తం (థ్రిఫ్ట్ ఫండ్)లో భాగంగా కార్మికులు తమ జీతం నుంచి రూ.8 పొదుపు చేస్తే, ప్రభుత్వం వారి జీతానికి డబుల్ మద్దతుగా ఇస్తుంది. ఈ పథకంతో 36,133 మంది చేనేత కార్మికులు 15 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు లబ్ది పొందుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్లో ఇందుకోసం రూ.30 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. తెలంగాణ నేతన్న భద్రత పథకం కింద చనిపోయిన చేనేత, అనుబంధ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నది. కార్మికులకు ప్రోత్సాహకంగా సంవత్సరానికి రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6 వేలు అందిస్తుంది. ఈ ఏడాది రూ.12.20 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 33 మంది నేత కార్మికులకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. నగరంలోని నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించే వేడుకల్లో వీటిని ప్రదానం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయే ఈ కార్యక్రమాన్ని చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్ పాల్గొంటారు.

అవార్డుకు ఎంపికైన వారు.


కరీంనగర్ తుమ్మ రామస్వామి, గుర్రం కొండయ్య, మంచిర్యాల లిక్కి శంకరయ్య, వరంగల్ కంచె నర్సింగరావు, జనగాం న్యాలపల్లి విజయ ప్రకాశ్, రాజన్న సిరిసిల్ల ఎల్దీ రేఖ, రంగారెడ్డి గంజం శ్రీనివాస్, గుర్రం చంద్రమౌళి, హైదరాబాద్ కర్దాసు రమేశ్, సిద్దిపేట జిందం రాజేశం, బైరి శ్రీనివాస్, మంతూరి వెంకటేశం, యాదాద్రి భువనగిరి గూడ పవన్. కొలను శంకర్, సామల భాస్కర్, మంగళపల్లి శ్రీహరి, చెలిమల కృష్ణ, నల్లగొండ కర్నాటి సదుర్గు, చిలుకూరి శ్రీనివాసులు, చిట్టిపోలు ధనుంజయ, గాజుల అనిల్, గుర్రం యాదయ్య, మునగపాటి శ్రీనివాస్, కర్నాటి కృష్ణయ్య, అవరి రవీంద్ర, నారాయణపేట జన్ను ఆంజనేయులు, యాంగల్ ఆంజనేయులు, జోగులాంబ గద్వాల్ సూర్య వెంకటేష్, లక్ష్మీ, వనపర్తి దేవరకొండ సీతన్న, శీల బుడ్డన్న, మహంకాళి సులోచన, సారంగి రాములు అవార్డుకు ఎంపికయ్యారు.

## సీఎం పేర్లతో పథకాలు దేశమంతటా ఉన్నారు..

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: సంక్షేమ పథకాల్లో ముఖ్యమంత్రుల పేర్లు, ఫొటోలు ఉపయోగించే విషయంలో సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ అంశంపై గతంలో మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ప్రభుత్వ పథకాల్లో సీఎంలు, ప్రధాని ఫొటోలను ఉపయోగించే విధానాన్ని దేశమంతా అనుసరిస్తోందని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయ యుద్ధాలకు కోర్టులను ఉపయోగించు కోకూడదని హితవు పలికింది.

అసలేం జరిగిందంటే..?

తమిళనాడు ప్రభుత్వం 'విత్ యు స్టాలిన్' పేరుతో నిర్వహిస్తోన్న ప్రచార కార్యక్రమంపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. ఈ క్రమంలోనే ఇటీవల అన్నాడీఎంకే పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం దీనిపై మద్రాసు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం.. కొత్తగా తీసుకువచ్చే ప్రజా సంక్షేమ పథకాల్లో జీవించి ఉన్న నేతల పేర్లు వాడొద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే వాటి గురించి ప్రచారం చేసేటప్పుడు




మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలు, పార్టీ గుర్తులు, జెండాను ఉపయోగించకుండా నిషేధించింది.

దీంతో మద్రాసు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవారు నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది. అనేక రాష్ట్రాల్లో రాజకీయ నాయకుల పేర్లతో పథకాలను ప్రవేశపెట్టారని, దీనిపై ఎలాంటి న్యాయపరమైన నిషేధాజ్ఞలు లేవని ధర్మాసనం ముందు తమిళనాడు ప్రభుత్వం వాదనలు వినిపించింది.

దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ మద్రాసు హైకోర్టులో వ్యాజ్యం వేసిన పిటిషనర్‌పై అసహనం వ్యక్తంచేసింది. "ఈ విషయంలో పిటిషనర్‌కు నిజంగా అంత ఆందోళన ఉంటే.. అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నేతలతో ఉన్న పథకాలను ఎందుకు సవాల్ చేయలేదు? పలు ప్రభుత్వ పథకాలకు ప్రధాని, రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తుల ఫొటోలు ఉపయోగించుకోవచ్చని సుప్రీం గతంలో అనుమతినిచ్చింది. దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. మీ రాజకీయ పోరాటాల కోసం కోర్టులను వేదికలు చేసుకోవద్దు" అని ధర్మాసనం స్పష్టంచేసింది. మద్రాసు హైకోర్టు తీర్పును పక్కనబెట్టిన సుప్రీంకోర్టు.. అక్కడ పిటిషన్ వేసిన అన్నాడీఎంకే నేత షణ్ముగంకు రూ.10 లక్షల జరిమానా విధించింది.

## తెలంగాణ నుంచి మరింతగా బియ్యం ఎగుమతిపై చర్చ



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు మరింత బియ్యం ఎగుమతిపై చర్చ జరిగింది. బుధవారం నాడిక్కడ ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ మంత్రి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలిశారు. తెలంగాణ నుంచి మరింత బియ్యం ఎగుమతిపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. స్నేహ పూర్వక, సహకార వాతావరణంలో ఈ సమావేశం జరిగింది. తెలం గాణ నుంచి దిగుమతి చేసుకుంటున్న నాణ్యత ఉన్న బియ్యం పట్ల ఫిలిప్పీన్స్ మంత్రి ప్రశంసలు కురిపించారు. తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతుల పరిధిని విస్తరించడానికి ఆయన ఆసక్తి కనబర్చారు. తెలంగాణ, ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్య సంబంధాన్ని విస్తరించడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది చివరిలో తెలంగాణలో పర్యటించాలని ఫిలిప్పీన్స్ మంత్రిని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆహ్వానించారు. దీనిపై ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్ సానుకూలత వ్యక్తం చేశారు.బియ్యంతో పాటు వరి ధాన్యాన్ని ఎగుమతి చేయాలనే తెలంగాణ ప్రతిపాదనపై ఫిలిప్పీన్స్ మంత్రి సానుకూలంగా స్పందించారు. పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్.. తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048) బియ్యం రకాన్ని ఎగుమతి చేసుకోవచ్చని సూచించారు. దీనిపైనా ఫిలిప్పీన్స్ మంత్రి ఆసక్తి చూపించారు. అంతేకాకుండా తెలంగాణ నుంచి మొక్కజొన్నను దిగుమతి చేసుకునే అవకాశం గురించి ఫిలిప్పీన్స్ మంత్రి ఆరా తీశారు. తెలంగాణలో పర్యటించాలని కోరిన ఉత్తమ్ కుమార్ రెడ్డిని.. ఫిలిప్పీన్స్ మంత్రి వారి దేశంలో పర్యటించాలని ఆహ్వానించారు. వాణిజ్య సంబంధం, సహకారాన్ని మరింతగా పెంచుకోవాలనే బలమైన కోరికను ఇరు పక్షాలు వ్యక్తం చేశాయి. దీంతో ఈ సమావేశం చాలా సానుకూలంగా ముగిసింది.

## అర్హులను మహిళా సంఘాల్లో చేర్పించండి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అర్హులైన మహిళలను వెంటనే మహిళా సంఘాల్లో చేరేలా అవగాహన కల్పించాలని అధికారులను సెర్ప్ అదనపు సీఈఓ కాత్యాయని ఆదేశించారు. కౌమార స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆమె 32 జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సెర్ప్ ఏపీడీలు, డీపీఎంలు, ఏపీఎంలతో జూమ్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా వృద్ధులు, వికలాంగుల, కిశోర బాలిక సంఘాలను నూతనంగా ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కోటిమందిని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో చేర్చేలా చూడాలన్నారు. అందులో భాగంగా ఈ నెల 11 నుంచి 30వ తేదీ వరకు గ్రూపుల్లో చేరేలా మహిళలకు అవగాహన కల్పించడం, జిల్లా, మండల స్థాయిలో వారితో సదస్సులు, సమావేశాలు నిర్వహించి సంఘంలో చేరితే జరిగే ప్రయోజనాలను విడమర్చి చెప్పాలని సూచించారు. కొత్త ఎస్‌హెచ్‌జీల డేటాను సెర్ప్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టర్లు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి రోజువారీగా పురోగతిని నివేదించాలని అభ్యర్థించారు.

## బీసీ రిజర్వేషన్లకు మోడీనే అడ్డంకి



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు ప్రధాని మోడీనే అడ్డంకి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ విషయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణ బీసీ బిల్లులకు ఆమోదం తెలపకుండా అడ్డు పడుతున్నారని ఆరోపించారు. 'బిల్లులు ఆమోదం తెలిపేందుకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ అడిగి చాలా రోజులైంది.. ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి సమాధానం రాలేదు. ఇదీ శోచనీయం. రేపటిలోగా అపాయింట్‌మెంట్ ఇచ్చి, సమస్యను విని పరిష్కరిస్తా రని ఆశిస్తున్నాం. నరేంద్ర మోడీ తాజాగా రాష్టపతిని కలిశారు. బీసీ బిల్లులపై అపాయింట్ మెంట్ ఇవ్వొద్దని రాష్ట్రపతిపై ఏమైనా ఒత్తిడి చేశారా..! కావొచ్చు.. బలహీన వర్గాలన్నీ ఆలోచన చేయాలి' అని ముఖ్యమంత్రి అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనలో తెలంగాణ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేయొద్దని, బీసీ బిల్లులకు ఆమోదం తెలపకపోతే ప్రధాని మోడీకి తెలంగాణ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను ఆమోదిస్తారా? గద్దె దిగుతారా? అని నిలదీశారు. బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా నిర్వహించిన కాంగ్రెస్ పోరుబాటలో ప్రధాని మోడీ టార్గెట్‌గా సీఎం రేవంత్ రెడ్డి కీలక కామెంట్లు చేశారు. 'నరేంద్రమోడీకి జంతర్ మంతర్ చౌరస్తా నుంచి సవాల్ విసురుతున్నా.. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా? లేదంటే మిమ్మల్ని గద్దెదించి, ఎర్రకోట మీద మూడు రంగుల జెండా ఎగరేసి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసి, 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకోమంటారా? ఏది ఏమైనా బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు మేం నిద్రపోం..' అని హెచ్చరించారు. 'అయ్యా.. నరేంద్రమోడీగారూ.. మీ గుజరాత్ నుంచి గుంట భూమి అడగలే. మీ పోరుబందర్ పోర్ట్ నుంచి గుక్కెడు నీళ్లడగలే.. మా తెలంగాణలో మా గడ్డ మీద బలహీనవర్గాలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చుకుంటామంటే మీ గుజరాత్ వాళ్లకు వచ్చిన కడుపు మంట ఏంటి? రిజర్వేషన్ల కోసం బిల్లులు ఆమోదించి.. 4.5 కోట్ల మంది ప్రజలు విజ్ఞప్తి చేస్తే మా బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకెవరిచ్చారని అడుగుతున్నా.. ' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

మా పోరాటం మోడీతోనే

'మన పోరాటం.. రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న చంద్రశేఖర్‌రావుతోనో, కిషన్ రెడ్డితోనో, బండి సంజరుతోనో, రాంచందర్‌రావుతోనో కాదు.. మన పోరాటం కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీతో..' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న ఆలోచన నరేంద్రమోడీకి లేదు.. కానీ ఆయన మోచేతి నీళ్లు తాగుతున్న కిషన్ రెడ్డి, బండి సంజరు, రాంచందర్‌రావుకు ఏమైంది? మీరు మళ్లీ తెలంగాణకు రారా? తెలంగాణ ఓట్లు మీకు అవసరం లేదా? బీఆర్ఎస్ తెంపుకున్నట్టే తెలంగాణ రాష్ట్ర ప్రజలతో మీ పేగు బంధం తెంపుకున్నారా? ' అని ప్రశ్నించారు.

సాధించి తీరుతాం

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ బిల్లులు ఆమోదం పొందే వరకు తాము నిద్రపోమని స్పష్టం చేశారు. బలహీన వర్గాలపై కక్ష గట్టిన గత సీఎం కేసీఆర్ 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చట్టం చేశారని విమర్శించారు.'నాడు కేసీఆర్ చేసిన చట్టం నేడు రిజర్వేషన్లకు గుదిబండగా మారింది. తెలంగాణలో బలహీన వర్గాల బిడ్డలు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాకుండా అడ్డుగా ఉన్న ఈ చట్టాన్ని తొలగించాలని తాము ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపాం. దానిని ఆమోదించడం లేదు. వెనుకబడిన వర్గాలకు స్థానిక ఎన్నికల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీలో ధర్నాకు దిగాం. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించి తీరుతాం' అని ముఖ్యమంత్రి అన్నారు.

## అదానీ కబ్జా నుంచి అటవీ భూమిని కాపాడండి




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: ఛత్తీస్‌గఢ్ అటవీ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖమంత్రి భూపేందర్ యాదవ్‌కు మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వా నితురాలు బృందాకరత్ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలితంగా 1742 హెక్టార్ల దట్టమైన అటవీ భూమి విధ్వంసానికి గురవుతుందని ఆమె ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విషయంలో జోక్యం చేసుకుని కెంటె బొగ్గు ప్రాజెక్టు విస్తరణ పనుల అమలును నిలిపివేయాలని కోరారు. ఈ ఏడాది జూన్‌లో సుర్గుజా జిల్లా అటవీ శాఖాధికారి ఆ సైట్‌లో తనిఖీ జరిపిన తర్వాత ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. హస్డియో-అరంద్ ప్రాంత బొగ్గు ప్రాజెక్టులో భాగమైన ఈ ప్రాజెక్టు నిర్వహణా భారాన్ని రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ సంస్థకు అప్పగించారు. రాజస్థాన్ పూర్వపు ప్రభుత్వం అదానీ ఎంటర్‌ప్రైజెస్ అయిన పర్సా కెంటె కాలరీస్ లిమిటెడ్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది.

ఇందులో అదానీకి 74శాతం వాటా వుంది. హస్డియో-పర్సా బొగ్గు ప్రాజెక్టుకు ఈ కంపెనీని ఆపరేటర్‌గా నియమించారు. రికార్డులను పరిశీలిస్తే ఈ వెంచర్ కింద గణనీయమైన మొత్తంలో బొగ్గు ప్రయివేటు కంపెనీకి చెందిన విద్యుత్ ప్రాజెక్టులకు మళ్లించ బడుతోందని వెల్లడైంది. పైగా తిరస్కరించబడిన బొగ్గు అనే పేరుతో ఇదంతా సాగుతోంది. ప్రజా ప్రయోజనాల పేరుతో ఈ బొగ్గు ప్రాజెక్టును చేపట్టి, అనుమతులు పొందినా నిజానికి అందులో ప్రజల ప్రయోజనాలకు సంబంధించి ఏమీ లేవని, అంతా ప్రయివేటు ప్రయోజనాలే అమలవుతున్నాయని, ఖనిజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని బృందాకరత్ లేఖ పేర్కొంది.

ఈ ప్రాజెక్టును అమలు చేస్తే, ఇప్పటికే మైనింగ్ పేరుతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలు మరింత వినాశనానికి గురవుతాయని అన్నారు. అధికారిక తనిఖీల నివేదిక ప్రకారం, నాలుగున్నర లక్షల చెట్లను కొట్టేస్తున్నారు. ఇవన్నీ కూడా దట్టమైన అటవీ భాగంలోనే వున్నాయి. ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వల్ల ఇప్పటికే ఈ ప్రాంతంలోని వేలాది చెట్లు ధ్వంసమయ్యాయి. జలాలు కలుషిత మయ్యాయి. భూసారం దెబ్బతింది. పైగా గ్రామ సభల అభిప్రాయాలను పూర్తిగా విస్మరించి మరీ ఈ ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఇలాంటి ప్రాజెక్టులకు గ్రామసభల ఆమోదం తప్పనిసరని రాజ్యాంగ, చట్ట నిబంధనలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల వాస్తవ ప్రాజెక్టును మించి చాలా పెద్ద మొత్తంలో భూభాగం ప్రభావితమవుతుంది. నిర్దిష్టమైన ఈ ప్రాంతంలో ప్రజల నివాసం లేనప్పటికీ ఈ ఏరియాకు వెలుపల అనేక గ్రామాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదముంది. ఇప్పటికే స్థానిక కమ్యూనిటీలకు చెందిన 1500కి పైగా రాతపూర్వక అభ్యంతరాలు ప్రభుత్వానికి అందినా, వాటిని పట్టించుకోలేదని బృందా కరత్ తన లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ఇలాంటి ప్రయివేట్ మైనింగ్ ప్రాజెక్టులు సాగిస్తున్న వినాశనం నుంచి మన అడవులను రక్షించుకో వడానికి కఠినమైన రక్షణ చర్యలు అవసరమని బృందా కరత్ ఆ లేఖలో మంత్రికి స్పష్టం చేశారు.ఈ ప్రాంతం లోని ఆదివాసీలు ఈ ప్రాజెక్టును తీవ్రంగా ప్రతిఘటిం చడం ద్వారా, చెట్లను కాపాడుకోవడానికి, తద్వారా ప్రకృతి నాశనం కాకుండా చూసేందుకు ప్రయత్నించేది వారేనని స్పష్టమైందని ఆ లేఖలో పేర్కొన్నారు. వారే దేశంలోని అడవులను నిజంగా కాపాడుకునేదని రుజువైందన్నారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా అడవులను కాపాడుకోవ డానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మీపై వుందని తెలిపారు.

# ఏసీబీ కి చిక్కిన జగిత్యాల జిల్లా రవాణా శాఖ అధికారి



జగిత్యాల అమృత్ తెలంగాణ ఆగస్టు 06 జగిత్యాల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు ?22,000 లంచం తీసుకుంటుండగా జిల్లా రవాణా అధికారి బానోత్ భద్రునాయక్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ACB అధికారుల ప్రకారం, కోరుట్ల మండలానికి చెందిన ఫిర్యాదుదారుడు శశిదర్ మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘించినందుకు అతని JCB, మొబైల్ ఫోన్‌ను DTO స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేయవద్దని, అతని ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని శశిదర్ వేడుకున్నాడు ఐతే 35000/- లంచం అడగగా 13000/-ముందుగా ఇచ్చినట్టు సమాచారం,మిగిలిన రూపాయలు ఇవ్వడానికి ముందు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని బద్రునాయక్ తో పాటు డ్రైవర్ ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మల్లాపూర్ అమృత్ తెలంగాణ ఆగస్టు 06 మల్లాపూర్ మండలం మొగిలిపేటలో ఇటీవల అనారోగ్యం తో చనిపోయిన యువకుడు బొల్లి అరుణ్ కుమార్ కుటుంబ సభ్యులకు 2004-2005 సంవత్సరం లో మొగిలిపేట జడ్పి ఉన్నత పాఠశాల లో కలిసి చదివిన 10 వ తరగతి బ్యాచ్ మిత్రులు అందరం కలిసి రూపాయలు 45,500/-ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఆపదలో ఆదుకున్నారు నిజమైన మిత్రులు అని పలువురు అభినందించారు.

# భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులన్నింటిని వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో భూభారతి దరఖాస్తుల పరిష్కారం పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారిగా ఇప్పటివరకు పరిష్కరించిన భూభారతి దరఖాస్తుల వివరాలను తహసీల్దారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులన్నింటిని వారంలోగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లయితే, తిరస్కరణకు సంబంధించి కారణాలను తప్పనిసరిగా పొందుపరచాలని తెలిపారు. అన్ని రకాల పౌర సేవలను గుర్తింపు పత్రాలను వెంటవెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా పత్రాల జారీ ప్రక్రియలో ఆలస్యం చేయకూడదని అన్నారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న కుల, ఆదాయ, నివాస, తదితర ధ్రువీకరణ పత్రాల వివరాలను తాసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించాలని చెప్పారు. కష్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీని సకాలంలో పూర్తి చేయని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించాలని అన్నారు. సదరు రైస్ మిల్లర్ల ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు వినగాడ వద్దని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, ఏడి సర్వే - ల్యాండ్ రికార్డ్ ఆర్ సుదర్శన్, పిడి హౌసింగ్ రాజేశ్వర్, తహసీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఖజానా కార్యాలయంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు.



అమృత తెలంగాణ నిర్మల్ న్యూస్ : కలెక్టరేట్ లోని జిల్లా ఖజానా కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఖజానా శాఖ అధికారులు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. డిటిఓ సరోజ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో తన రచనలు ప్రసంగాల ద్వారా ఎంతో మందిని ఉద్యమం వైపు ముందుండి నడిపించారని అన్నారు. తెలంగాణకు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నీళ్లు, నిధులు, నియామకాలలో జరిగిన అన్యాయాలు తెలంగాణ సమాజం ముందు ఉంచి, ప్రజలను జాగృతం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి దాత్రిక రమేష్, అధికారులు శ్యాంసుందర్, రవిచందర్, సుజన్, ఫహీం, విజయ్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ నాయకుడు గద్దర్ వర్ధంతి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ నాయకుడు గద్దర్ వర్ధంతి యుద్ధనౌక గా పేరుంది నా ప్రజా గాయకుడు గద్దర్ ద్వితీయ వర్ధంతినీ జిల్లా మాల సంక్షేమ సంఘం భవనం నందు ఘనంగా నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించడం జరిగినది ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ మాట్లాడుతూ గద్దర్ అనగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన ఉద్యోగాన్ని వదులుకొని తనవిప్లవ గెయాల తో ప్రజలందరిలో ఉద్యమ భావాలను నింపి ఉద్యమాలు చేసి ప్రజా గాయకకుడిగా పేరుగాంచినడు ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరుతో గద్దర్ అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రధానం చేస్తుంది ఇందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నాము అన్నారు ఈ కార్యక్రమంనందు జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ అధ్యక్షులు మేకల మల్లన్న అసోసియేషన్ అధ్యక్షుడు పాశం రాఘవేంద్ర సంయుక్త కార్యదర్శి ముల్కల రాజేశ్వర్ సీనియర్ నాయకులు బేర దేవన్న మహేంద్ర స్వామి నరేందర్ సింగర్ అశోక్ పతిహర ప్రభాకర్ ఉడుగు సత్యనారాయణ అశోక్ ప్రశాంత్ సంటి రవి ఎలక రాజు,ముచ్చరఘు,మలపతిసుభాష్,అయిత పాచ్చన్న మొదలైన వారు పాల్గొన్నారు,

# నిర్మల్ పోలీసింగ్ లో మహిళా మైలురాయి - బ్లూ కోర్టు, డయల్ 100 కి సత్వర ప్రతి స్పందన

## ప్రతీ బుధవారం మరింత ప్రభావవంతంగా కొనసాగుతున్న నారిశక్తి కార్యక్రమం

నారిశక్తి

నిర్మల్ పోలీస్... మీ పోలీస్



"నిర్మల్ పోలీసింగ్‌లో మహిళా మైళురాయి – బ్లూ కోర్టు, డయల్ 100 కి సత్వర ప్రతిస్పందన"

**నారిశక్తి - ప్రతి బుధవారం మరింత ప్రభావవంతంగా..**

అమృత తెలంగాణ నిర్మల్ న్యూస్ : నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ నాయకత్వంలో ప్రతీ బుధవారం "నారిశక్తి" కార్యక్రమం మరింత ప్రభావవంతంగా కొనసాగుతోంది. నిర్మల్ పోలీస్ శాఖ చేపడుతున్న ప్రతి బుధవారం "నారిశక్తి" కార్యక్రమంలో భాగంగా, నేడు మహిళా పోలీస్ సిబ్బంది తమ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో పెట్రోలింగ్ డ్యూటీ తో పాటు వచ్చిన డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి బాధితుల సమస్యలను పరిష్కరించారు. వీటితో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి, గ్రామాల్లో ఉన్న పాఠశాలలను సందర్శించి పిల్లలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు.మరియు ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి వివరించారు. విలేజ్ పోలీసింగ్ లో భాగంగా మహిళా సిబ్బంది తమ పోలీస్ స్టేషన్ పరిధి లోని ప్రతీ గ్రామాల్లో తిరుగుతూ కల్తీ కల్లు, గంజాయి వాడకం, అక్రమ రవాణాపై ప్రజలకు చైతన్యం కల్పించారు. అనంతరం నారిశక్తులు వాహన తనిఖీలు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు ఈ "నారి శక్తి" కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల మహిళా సిబ్బంది చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

# 11 కెవి విద్యుత్ తీగల ప్రమాదానికి గురైన పారిశుద్ధ్య కార్మికుడు

## పరమర్శించడానికి వెళ్లిన ఎస్.జె.డబ్ల్యూ.హెచ్.ఆర్.సి రాష్ట్ర ప్రతినిధులు:- డాక్టర్ సాప పండరి, భైంసా మండల ప్రతినిధి ఆడేల్లి సాయి కిరణ్, ప్రాణాలు పోతే గాని పట్టించుకోరా అధికారులు అని ప్రశ్నిస్తున్న సామాన్యులు:-

నిర్మల్ జిల్లా బైంసా ఆగస్టు 6 అమృత్ తెలంగాణ 25-06-2024 న సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధి డాక్టర్ సాప పండరి తో పాటు, బాధితులు వరంగల్ వెళ్లి సి.ఎం.డి కర్నాటి వరుణ్ రెడ్డికి వినతి పత్రం అందజేత:- గత 20 సంవత్సరాల నుండి కుబీర్ గ్రామంలోని న్యూ అబాది కాలనీ నందు 11 కెవి విద్యుత్ తీగలు, కిందికి వేలాడుతున్నాయని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు వినతి పత్రములు అందజేసిన ఫలితం శూన్యం. సుమారు 40 ఇళ్ల మీదుగా 11 కెవి విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ వెళు న్నాయని, ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని, గతంలో 8 సంవత్సరాల కిందట 8 ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యాయని, తినే ధాన్యము, కట్టుకునే గుడ్డలు, వాడుకునే వస్తువులు పూర్తిగా మాడి మసి అయ్యాయని, ఆ సమయంలో పోలీసు సిబ్బంది, తహసిల్దార్, ఎంపీడీవో గార్లు కేసు నమోదు చేసి బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. గత పది సంవత్సరాల కిందట పది సంవత్సరాల అమ్మాయి స్లాబుపై ఆటలాడుతుండగా, అనుకోకుండా చేతులు తీగలకు తగలడంతో తీవ్ర గాయాలపాలై, లక్షలు ఖర్చుపెట్టగా ప్రాణాపాయం నుండి బయటపడిందని స్థానికులు చెబుతున్నారు. గత మూడు సంవత్సరాల కిందట 4 లక్షల 60 వేల రూపాయలు విద్యుత్ శాఖకు డిడి రూపంలో చెల్లిస్తే తీగలను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో, కూలి పని చేసుకునే సామాన్యులు అందరూ కలిసి డిడి కూడా తీశారు. డిడి కట్టి మూడు సంవత్సరాల అయినప్పటికీని, ఇప్పటి వరకు విద్యుత్ తీగలను తొలగించక పోవడానికి గల కారణం ఏమిటని సామాన్యులు సైతం నివ్వెర పోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి 11 కెవి విద్యుత్ తీగలను తొలగించాలని కోరుకుంటున్నారు. సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ సాప పండరి, బైంసా మండల ప్రతినిధి ఆడేలోల్ల సాయికిరణ్ అంబాదాస్ ను పరామర్శించి, చాలీచాలని వేతనానికి పనిచేస్తున్న కార్మికుడు ప్రస్తుతం మూడు నెలల వరకు ఇంటి దగ్గరే విశ్రాంతి తీసుకోవాలని చెప్పడంతో, కుటుంబ భారం గురించి ఆలోచిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం అంబదాస్ కుటుంబాన్ని పూర్తిగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డాక్టర్ సాప పండరి తెలియజేశారు. ఇప్పటి వరకు పంచాయతీ సెక్రటరీ జాడే గౌతం, ఎం.పి.ఓ మోహన్ సింగ్ తప్ప మిగత ఏ ఉన్నత అధికారులు కనీసం స్పందించలేదని కుటుంబీకులు చెబుతున్నారు




T.G.N.P.D.C.L. వరంగల్ సి.ఎం.డి కర్నాటి వరుణ్ రెడ్డికి వినతి పత్రం అందజేయడానికి వెళ్లిన ఎస్ జె డబ్ల్యూ హెచ్ ఆర్ సి ప్రతినిధి డాక్టర్ సాప పండరి తో పాటు 11 కెవి విద్యుత్ తీగల బాధితులు ఫారుక్, మేర రమేష్, ఎస్ పోతన్న,బిట్లింగ్ హన్మాండ్లు,పెదపార్డి శంకర్ తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రజా ట్రస్ట్ చైర్మెన్ భోస్లే మోహన్ రావ్ పటేల్



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన దృశ్యం

నాందేడ్ జిల్లా ఆగస్టు 6 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గ న్యూస్ మహారాష్ట్ర లోని నాదెండ్ జిల్లా దెగ్లూరు(దేగాం) గ్రామానికి చెందిన సురేష్ జయవంత్ రావ్ దేశాయి దేగావ్ కార్, ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించడం జరిగింది మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మెన్ భోస్లే మోహన్ రావ్ పటేల్, రోజు దెగావ్ గ్రామంలో వారి నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు



చిత్రపటానికి పూల దండ వేసి సంతాపం తెలుపుతున్న దృశ్యం

# ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లో భాగంగా సోనాల మండలం కోటకే గ్రామంలో కోళ్ల ఫారం ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.







జిల్లా కేంద్రం లోని బంగారి గూడ ఎంపీపీస్ స్కూల్ ను బుధవారం సందర్శించి 5 వ తరగతి గదిలో విద్యార్థులకు గణితం బోధిస్తున్న తీరును , విద్యార్థుల వర్క్ బుక్ ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లో భాగంగా, కోటకే గ్రామంలో నిర్మించిన కోళ్ల ఫారాన్ని జిల్లా కలెక్టర్ బుదవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు , గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలపరిచేందుకు రూపొందించబడిందని కలెక్టర్ తెలిపారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధిని పొందేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని. అన్నారు. ప్రభుత్వ సహకారంతో నూతన ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయిని అన్నారు. ఈ కోళ్ల ఫారం ద్వారా మహిళా స్వయం సహాయ సంఘాలకు ఉపాధి అవకాశాలు లభించడమే కాక, గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార భద్రతకు కూడా తోడ్పాటవుతుందన్నారు ఈ కార్యక్రమంలో drdo రవిందర్, తదితరులు పాల్గొన్నారు

# విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం

**భావిభారత పౌరులకు చదువులతల్లి ఒడిలోనే విద్యతో పాటు సమగ్ర వికాసాన్ని బోధిద్దాం .....**

**ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్...**





ఎమ్మెల్యేలను సన్మానించిన మహిళా ఉపాధ్యాయులు



ఎమ్మెల్యేను పూల గుచ్ఛతో సన్మానిస్తున్న దృశ్యం

## మెడల్ స్కూల్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా కుంటాల ఆగస్టు 6 అమృత్ తెలంగాణ కుంటాల మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన విద్యార్థుల కల్చరల్ ఫెస్టివల్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుంటాల ఆదర్శ పాఠశాలలో ఘనంగా కల్చరల్ ఫెస్టివల్

చదువుతోనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు బాల్యం నుంచే దేశ భక్తి ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ ప్రాంతా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేశాయని ,లి ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో సీసీ నిర్మాణం, ఆర్టీసీ ఆదనవు సేవలు, మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సాహపంక్తి భోజనంచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, రాష్ట్ర సాధనకు ఎనలేని కృషి చేసిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ - అదనపు ఎస్పీ బి సురేందర్ రావు

**తెలంగాణ స్ఫూర్తిదాతకు ఘన నివాళి.**

**ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహన**

**పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించిన కార్యాలయ సిబ్బంది అధికారులు.**

**తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి చేసిన కృషి, సేవలు మరువలేనివి**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : తెలంగాణ ఉద్యమానికి మలి దశలో ఊపిరి పోసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ సదా స్మరణీయులు అని అదనపు ఎస్పీ బి సురేందర్ రావు తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకున్నారు, సిబ్బందికి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు అందరూ ఆచార్య జయశంకర్ సార్ చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఆపరేషన్స్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్స్, కార్యాలయాలలో జయశంకర్ జన్మదిన ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నట్లు తెలిపారు. ఆచార్య జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ఆచార్య జయశంకర్ సార్ దూరదృష్టి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే అవుతుందని గుర్తించి రాష్ట్ర సాధనకు తొలి దశలో, మలిదశలో ముందుండి నడిపించారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగే అన్యాయాన్ని గుర్తించి రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు, ఉపాధి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి త్వరగా సాధ్యమవుతుందని ప్రొఫెసర్ జయశంకర్ సార్ రాష్ట్ర సాధనకు తన చివరి రోజు వరకు పోరాడారని స్మరించుకున్నారు.

ఆచార్య కొత్తపల్లి జయశంకర్

తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ (ఆగస్టు 6, 1934 – జూన్ 21, 2011) హనుమకొండ జిల్లా, ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామశివారు అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డి పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు.

1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్– ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పే జయశంకర్ 2011 జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు పోతారం శ్రీనివాస్, కమతం ఇంద్ర వర్ధన్, పోలీసు ముఖ్య కార్యాలయం ఏవో భక్త ప్రహ్లాద్, సూపరిండెంట్లు సులోచన, సంజీవ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఇన్స్పెక్టర్ గుణవంతరావ్, డిసిఆర్బి, పోలీసు కార్యాలయ సిబ్బంది, ఎన్ఐబి ఫింగర్ప్రింట్ తదితరులు పాల్గొన్నారు

# పేదలపై ఎల్ఎండి నోటీసులు అన్యాయం





కరీంనగర్ :అమృత్ తెలంగాణ: ఎల్ఎండి అధికారులు 30 మీటర్ల పరిధిని దాటి సప్తగిరికాలనీ పరిధిలోని పేదలకు, హస్నాపూర్ కాలనీవాసులకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, బీజేపీ నేత, మాజీ మేయర్ వై. సునీల్ రావు బుధవారం బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం న్యాయమైన గరిష్ఠ హద్దులు దాటుకొని భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "పేదల నివాసాలే లక్ష్యంగా మారడాన్ని సహించం, నోటీసులు ఉపసంహరించకపోతే పెద్దస్థాయి ఆందోళన చేపడతాం" అని ఘాటుగా హెచ్చరించారు. కరీంనగర్ నగరంలోని సప్తగిరి కాలనీ పరిధిలో బతుకమ్మ కాలనీ, హస్నాపూర్ కాలనీ, పెద్దమ్మ కాలనీల్లో నివాసముంటున్న వాసులకు ఎల్ఎండి అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. డ్యాం కట్ట 30 మీటర్ల పరిధిలో ఉన్న భూభాగంలో అనధికారికంగా నివసిస్తున్నారనే కారణంతో ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం బీజేపీ నేత, మాజీ మేయర్ వై. సునీల్ రావు బాధితులను పరామర్శించి, వారి ఆవేదన విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఎస్సారెస్పీ లేదా ఎల్ఎండి అధికారులకు 30 మీటర్ల దాటి చర్యలు చేపట్టే హక్కు లేదు. తమ పరిధిని మించి ప్రజలపై ఒత్తిడి తేవడం చట్ట విరుద్ధం," అని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ ట్యాంకులు, ఆర్టీవో కార్యాలయం, ఐటీ టవర్, కేంద్ర విద్యాలయం వంటి ప్రభుత్వ నిర్మాణాలు కూడా డ్యాం కట్ట సమీపంలోనే ఉన్నా, వాటిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ అంశాన్ని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. "బండి సంజయ్ వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారానికి హామీ ఇచ్చారు," అని తెలిపారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి జన్మదిన వేడుకలు....

ముధోల్ నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో జన్మదిన వేడుకలను జరుపుకున్న నాయకులు....



మాజీ శాసనసభ్యులు జి విట్టల్ రెడ్డి, జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన బైంసా మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీక్షిత్.



కుబేర్ మండలంలోని పార్డి గ్రామంలో మన ప్రియతమ నాయకులు మాజీ ఎమ్మెల్యే జి విట్టల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.....



ముధోల్ ముద్దుబిడ్డ మాజీ ఎమ్మెల్యే జి విట్టల్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని బుధవారం మాహూర్ పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కుబీర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.



తానూరు మండల కేంద్రంలో ఘనంగా మాజీ శాసనసభ్యులు జి విట్టల్ రెడ్డి, జన్మదిన వేడుకలు.తానూరు మండల ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసిన తానూరు మండల కాంగ్రెస్ నాయకులు....



మన్మధ గ్రామంలో మాజీ శాసనసభ్యులు జి విట్టల్ రెడ్డి, పుట్టినరోజు సందర్భంగా బాలికల హాస్టల్ నందు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది



కుంటల మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు జి విట్టల్ రెడ్డి, జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కుంటాల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు

నిర్మల్ జిల్లా ముధోల్ ఆగస్టు 6 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి జన్మదిన వేడుకలను ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు అన్ని మండలాల్లో కేకులు కట్ చేసి అంగరంగ వైభవంగా జన్మదిన వేడుకలను జరుపుకున్నారు

# అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తాం: కలెక్టర్



తంగళ్ళపల్లి అమృత్ తెలంగాణ: అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి లోని ఎస్ ఎస్ గార్డెన్స్ లో నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్, కేకే మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. తంగళ్లపల్లి మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. వీటి ద్వారా పేదలకు రేషన్ అందుతుందన్నారు. మండలంలో నూతనంగా 1397 కొత్త కార్డులు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో 2224 మంది కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసి అందిస్తున్నామని వెల్లడించారు. ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అన్నారు. ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్ , ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కే కే మహేందర్ రెడ్డి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొకటి అమలు చేస్తూ ముందుకు వెళ్తుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణ మాఫీ, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం,

ఇందిరా మహిళా శక్తి కింద క్యాంటీన్లు, మిల్క్ పార్లర్, ఆర్ టీ సీ బస్సులు, పెట్రోల్ బంక్, ఫెర్టిలైజర్ దుకాణాలు ఇతర స్వయం ఉపాధి యూనిట్లు ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డి డబ్ల్యు ఓ లక్ష్మీరాజ్యం తహసిల్దార్ జయంత్ , వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# వనమహోత్సవం లక్ష్యాలను చేరుకోవాలి: కలెక్టర్



బజార్ హాత్నూర్ :అమృత్ తెలంగాణ: వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చే పట్టిన వన మహోత్సవం కార్యక్రమం లక్ష్యాల ను పూర్తి స్థాయిలో సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుదవారం మండలంలోని గిర్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కనకాయి వాటర్ ఫాల్ రాడ్డులోని కెనాల్ పై వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ వాతావరణ స మతుల్యాన్ని కాపాడుతూ భావితరాలకు సహజ సిద్ధమైన వాయువును అందించేందుకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షిం చాలని తెలిపారు. అంతేకాకుండా గిర్నూర్ గ్రామస్తులు కెనాల్ పక్కనే ఉన్నా రోడ్డు బుదదమయంగా ఉ ఒడడంతో కనకాయి జలపాతానికి మరోవైపు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రవాణా లేకపోతే అభివృద్ధి ఆగుతుంది



జన్నారం :అమృత్ తెలంగాణ: ఏ ప్రాంతంలోనైతే రవాణా సౌకర్యాలు ఉండవో ఆ ప్రాంతం అభివృద్ధి సక్రమంగా జరగదని, అటవీ శాఖ తీసుకున్న భారీ వాహనాల రాకపోకల నిషేధాన్ని ఎత్తివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళిందరా?న్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గత 22 రోజులుగా నిరావాదిక దీక్ష చేస్తున్న వారికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జన్నారం మండల కేంద్రంలో ప్రజా ఉ ద్యమ రూపంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. రాష్ట్ర అటవీ శాఖ జారిచేసిన చట్టం ప్రకారం జన్నారం కడెం దండేపల్లి మండలాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే చందంగా ఉంది భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయడం ద్వారా వివిధ మండలాల్లోని గ్రామాల ప్రజలకు పెను భారంగా ఉందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. నిర్మాణరంగం కుంటు పడడం ద్వారా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస పనులు దొరకక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ మండలాలు వ్యవసాయ మండలాలు కావడం వల్ల కూడా విత్తనాలు ఎరువులు మందుల రేట్లు విపరీతంగా పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలకు రాష్ట్ర అటవీ శాఖ జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలని కోరుతూ తక్షణమే ఈ ఆంక్షలను ఎత్తివేయాలి ఏ ప్రభుత్వాలైనా గాని ప్రజలకు ఉ పయోగపడే చట్టాలు తేవాలి కానీ ప్రజా వ్యతిరేక చట్టాల ద్వారా ప్రజా జీవితాలను భగ్నం చేయకూడదని హితవు పలికారు.ఇలాంటి అంశాల ద్వారా పాలక ప్రభుత్వాలపై ప్రజలకు అసహనము పెళ్ళుబికి ప్రజా తిరుగుబాటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పాలక ప్రభుత్వాలు అటవీ ఆంక్షలు సడలించి మూడు ప్రభావిత మండలాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని జనరంజకమైన ప్రజా ఉపయోగకర నిర్ణయాలను తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీగా డిమాండ్ చేస్తా ఉన్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దాసరి తిరుపతి జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న జన్నారం మండల కన్వీనర్ మామిడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య జయశంకర్ సార్, ప్రజా యుద్ధ నౌక గద్దర్ చేసిన సేవలు చిరస్మరణీయం..

### జయశంకర్ సార్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నివాళులు అర్పించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి





జయశంకర్ అమరే అంటూ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : తెలంగాణ ఉ ద్యమ సిద్ధాంతకర్తగా, తెలంగాణ ప్రజల సాధికారత కోసం తన జీవితాన్ని సైతం అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ గారని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆచార్య జయశంకర్ సార్ గారి జయంతిని పురస్కరించుకుని నేడు జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గల జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయశంకర్ సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ ఆయన చేసిన సేవలని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జాతిని జాగృతం చేయడంలో జయశంకర్ గారు కీలక పాత్ర పోషించారని అన్నారు. ఉ న్నత విద్యావంతుడిగా, ప్రొఫెసర్ గా ఎంతోమంది జీవితాలను మార్చిన వ్యక్తి అని, తన జీవితమంతా తెలంగాణ రాష్ట్ర సాధనకోసం పోరాడిన మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో మనం నడవడం ద్వారా, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడం ద్వారా ఆయనకు నిజమైన నివాళు లర్పించగలమని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అటు నేడు ప్రజా యుద్ధ నౌక గద్దర్ గారి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నట్లు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. తన గాత్రంతో యావత్ తెలంగాణ ప్రజలను ఉద్యమం వైపు నడిపించి, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాల్గొన్న గద్దర్ గారి సేవలు మరువలేనివని, తెలంగాణ ప్రజా ప్రభుత్వం వారి పేరిట గద్దర్ అవార్డులను సైతం ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు.

కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామ రూపేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి అట్ల గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, మర్సకోళ్ల గౌతమ్, సురేష్ కుమార్, అశోక్, వసీం , ముర్తుజా, సమీ ఉల్లాఖాన్, అప్సర్ అలీ, మేకల జితేందర్, మన్సూర్ ఖాన్, అఫ్సర్ ఖాన్ రేండ్ల రాజన్న, అలీం తదితరులు పాల్గొన్నారు.

## కావ్య పాప గ్లామర్ ఫీస్ట్ ఈ లుక్స్ లో కావ్య కళ్యాణ్ రామ్



కావ్య పాప గ్లామర్ ఫీస్ట్ ఈ లుక్స్ లో కావ్య కళ్యాణ్ రామ్ మెస్మరైజ్ చేస్తోందనే మాట వినిపిస్తోంది. తన అందానికి కాస్త గ్లామర్ టచ్ ఇస్తూ కుర్రాళ్ళకి విజువల్ ఫీస్ట్ అందిస్తోందని కామెంట్స్ వస్తున్నాయి. బాలు సినిమాలలో చైల్డ్ యాక్టర్ గా నటించిన కావ్య కళ్యాణ్ రామ్ ను అంత ఈజీగా ఎవరూ మర్చిపోరు. ఈ పిల్లి కళ్ళ పాప 'మసూద' సినిమాతో హీరోయిన్ గా మారింది. మొదటి చిత్రంతోనే సక్సెస్ అందుతుంది. తర్వాత 'బలగం' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ దక్కింది. ఈ రెండు సినిమాలు ఆమెకు టాలీవుడ్ లో మంచి క్రేజ్ తీసుకొచ్చాయి. తర్వాత శ్రీ సింహకు జోడీ 'ఉస్తాద్' సినిమాలో ఈ బ్యూటీ నటించింది. అయితే ఈ చిత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో సక్సెస్ కాలేదు. బాలీవుడ్, హాలీవుడ్ కనెక్షన్! ఈ మూవీ తర్వాత ఇప్పటివరకు కావ్య కళ్యాణ్ రామ్ కొత్త చిత్రం అయితే రాలేదు. కానీ సోషల్ మీడియాలో ఆమె చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో తన అప్డేట్స్ షేర్ చేస్తూ ఉంటుంది. అలాగే అప్పుడప్పుడు గ్లామర్ ఫోటోలతో ఎట్రాక్ట్ చేస్తోంది. ఈ అమ్మడు ఫోటోలకు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. అందుకే ఎలాంటి ఫోటోలు పెట్టిన వైరల్ అవుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే తాజాగా ఈ బ్యూటీ వైట్ కలర్ గౌన్ లో అదిరిపోయే లుక్స్ తో గ్లామర్ ఫోటోలని షేర్ చేసింది. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ లుక్స్ లో కావ్య కళ్యాణ్ రామ్ మెస్మరైజ్ చేస్తోందనే మాట వినిపిస్తోంది. తన అందానికి కాస్త గ్లామర్ టచ్ ఇస్తూ కుర్రాళ్ళకి విజువల్ ఫీస్ట్ అందిస్తోందని కామెంట్స్ వస్తున్నాయి. ఈ ఫోటోలు పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఆమె అందాన్ని వర్ణిస్తూ ఎమోజీలు పెడుతున్నారు. తెలుగు అమ్మాయిలను తెలుగు సినిమాల్లో హీరోయిన్స్ గా ఎంకరేజ్ చేయడం లేదనే మాట చాలా కాలంగా వినిపిస్తోంది.

## చిరు సాబ్.. ఏజ్ పెరుగుతుందా? తగ్గుతుందా?



బ్లాక్ గూగుల్స్ పెట్టుకున్న మెగాస్టార్.. వేరే లెవెల్ లో ఉన్నారని చెప్పాలి. ప్రస్తుతం చిరంజీవి.. కొత్త పిక్స్ తెగ చక్కర్లు కొడుతున్నాయి. బాస్ అదరగొట్టేశారని ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఎన్నో అవార్డులు.. మరెన్నో ఘనతలు.. ఇంకెన్నో రివార్డులతో ఎప్పటికీ చెరగని ముద్ర వేసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాల్లో నటించి మెప్పించారు. తన యాక్టింగ్, వేరే లెవెల్ డ్యాన్స్ తో ఒక బ్రాండ్ గా ఎదిగిన ఆయన.. ఇప్పటికీ కుర్ర హీరోలకు గట్టిపోటీనిస్తూ దూసుకుపోతున్నారు. ఆరు పదుల వయసులో కూడా ఇంకా కుర్రాడిలాగే కనిపిస్తుంటారు చిరు. ఎప్పటికప్పుడు ఫొటో షూట్స్ తో సందడి చేస్తుంటారు. తన యంగ్ లుక్స్ తో ఆకట్టుకునే చిరు లేటెస్ట్ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. సింపుల్ అండ్ మోడ్రన్ డ్రెస్ వేసుకున్న ఆయన.. గార్డెన్ లో కిర్రాక్ పొజులు ఇచ్చారు. బ్లాక్ గూగుల్స్ పెట్టుకున్న మెగాస్టార్.. వేరే లెవెల్ లో ఉన్నారని చెప్పాలి. ప్రస్తుతం చిరంజీవి.. కొత్త పిక్స్ తెగ చక్కర్లు కొడుతున్నాయి. బాస్ అదరగొట్టేశారని ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు. వయసు పెరుగుతుందో.. తగ్గుతుందో అర్థం కావడం లేదని అంటున్నారు. సింపుల్ సూపర్బ్ అని చెబుతున్నారు. యంగ్ జనరేషన్ కు ఆయన అన్ని విషయాల్లోనూ ఇన్స్పిరేషన్ అని అంటున్నారు. ఇక చిరు సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం విశ్వంభర మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. సోషియో ఫాంటసీ కథాంశంతో బింబిసార ఫేమ్ వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఆ సినిమా.. వచ్చే ఏడాది సమ్మర్ లో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. నిజానికి సంక్రాంతికి సినిమా రిలీజ్ కావాల్సి ఉన్నా పలు కారణాల వల్ల వాయిదా పడింది.

## స్టార్ హీరోయిన్ స్టన్నింగ్ లుక్ వైరల్ శ్రీలంకన్ బ్యూటీ జాక్విలిన్ ఫెర్నాండెజ్



పరిచయం అవసరం లేదు. ఇటీవల కొన్ని వివాదాలతో ఈ బ్యూటీ పేరు నిరంతరం హెడ్ లైన్స్ లోకొచ్చింది. శ్రీలంకన్ బ్యూటీ జాక్విలిన్ ఫెర్నాండెజ్ పరిచయం అవసరం లేదు. ఇటీవల కొన్ని వివాదాలతో ఈ బ్యూటీ పేరు నిరంతరం హెడ్ లైన్స్ లోకొచ్చింది. తనకు 2024 తీపి చేదుగుళికల మిశ్రమం. మరోవైపు లక్షలాది మంది ఫాలోవర్స్ తో సోషల్ మీడియాల్లో టాప్ స్టార్ గా వెలిగిపోతోంది జాకీ. ఇంతకుముందు ప్రభాస్ సాహెూ లోను జాక్విలిన్ ప్రత్యేక గీతంలో నర్తించింది. ప్రస్తుతం ఈ బ్యూటీ బాలీవుడ్ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అక్షయ్ కుమార్ హౌస్ ఫుల్ 5 చిత్రంలోను ఈ బ్యూటీ నటిస్తోంది. ఇప్పుడు నటుడు సోనూసూద్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం ఫతేలో నటించింది. ఇది సోనూ, జాకీ ఇద్దరికీ కొత్త ఎత్తులకు తీసుకెళ్లే హై ఆక్టేన్ యాక్షన్ చిత్రం అని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ సోమవారం ఆవిష్కరించారు. ఇందులో జాక్వెలిన్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలలో జాక్విలిన్ ఎనర్జీ అందరి దృష్టిని ఆకర్షించింది. ట్రైలర్ లాంచ్‌లో మాట్లాడుతూ, జాక్వెలిన్ తన సహనటుడు, దర్శకుడు సోనూతో కలిసి పనిచేసిన అనుభవం గురించి వెల్లడించింది. కథ విన్నప్పుడే సోనూ కళ్లలో నాపై చాలా నమ్మకం కనిపించింది. దర్శకుడిగా అతడి అభిరుచిని చూశాను. అందుకే ఈ చిత్రం చేయాలని భావించాను అని జాక్వెలిన్ గుర్తుచేసుకుంది. చాలా ఫ్రెష్ గా ఉండే పాత్రలో నటించాను. ఈ సినిమా కథనం చాలా శక్తివంతంగా ఉ ంటుందని కూడా జాకీ చెప్పింది. సోనూ సూద్‌తో కలిసి పని చేయడం అద్భుతమైన శక్తిని ఇచ్చిందని దర్శకుడిగా అతడు చక్కని పాత్రను పోషించాడని కూడా కితాబిచ్చింది. ఈ లెజెండ్ సోను దర్శకత్వంలో నటించడం చాలా భిన్నమైన అనుభవం. నాలో ఉన్న బెస్ట్ ని బయటకు తీసుకురావడానికి నిబద్ధతతో పని చేసాడని జాకీ ప్రశంసించింది.






మేఘాశుక్లా హాట్ ఇన్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com